'బెస్ట్ అవైలబుల్'లో ఎంపికకు

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 8: బెస్ట్ అవైలబుల్ పథకంలో ఎంపికకు ప్రైవేటు పాఠశాలలు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమాధికారి విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు 2024-25 విద్యా సంవత్సరానికి ఈ పథకంలో ఎస్సీ విద్యార్థుల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రెసిడెన్సియల్ 61 సీట్లు, నాన్ రెసిడెన్సియల్ పాఠశాలల్లో 59 సీట్లలో ప్రవేశాలు కల్పించడానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ఆసక్తి ఉన్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు వారి పాఠశాలల వివరాలను కలెక్టరేట్‌లోని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమాధికారి కార్యాలయంలో ఈ నెల 25వ తేదీలోగా నమోదు చేసుకోవాలని సూచించారు.

ఎన్ఆర్ఈజీఎస్‌లో

నిధులు మంజూరు

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 8: మండలంలోని వివిధ గ్రామాల్లో సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్‌లో రూ. 2.25కోట్లు మంజూరయ్యాయని ఎంపీపీ భాగ్యలక్ష్మి తెలిపారు. అంబాజీపేటలో ఎం పీపీ నిధులతో నిర్మించనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని అంబాజీపేట, శేరిపల్లి గ్రామాలకు రూ.15లక్షలు, చందాపూర్, సంకాపూర్ గ్రామాలకు రూ. 10లక్షలు, కొర్విపల్లి గ్రామానికి రూ. 25లక్షలు, చిన్నశంకరంపేటకు రూ. 50లక్షలు, గవ్వలపల్లి, ఎస్.కొండాపూర్, జంగరాయి, సూరారం, మల్లుపల్లి గ్రామాలకు రూ.25లక్షల చొప్పున మొత్తం రూ.2.25కోట్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జయమ్మ, మాజీ సర్పంచ్‌లు సత్యనారాయణ, సాయిలు, మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, నాయకులు బాలకిషన్, లక్ష్మణ్, నవాజ్, రాణీవెంకటేశం, నర్సింహులు, యాదగిరి, ఉదయ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తా

రామాయంపేట, ఫిబ్రవరి 8: రామాయంపేట శివారులోని కేసీఆర్ కాలనీ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తహసీల్దార్ రజినీకుమారి తెలిపారు. గురువారం కాలనీవాసులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. రామాయంపేట నుంచి కాలనీకి సరైన రోడ్డు లేక ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు తహసీల్దార్ వెంట ఆర్ఐ రాజు ఉన్నారు.

నకిలీ నోట్ల కేసులో

మూడేండ్ల జైలుశిక్ష

రేగోడ్, ఫిబ్రవరి 8: నకిలీ నోట్ల చలామణి కేసులో ఒకరికి మూడేండ్ల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై రాజయ్య తెలుపారు. ఎస్సై తెలిపిన వివరాలు.. మండలంలోని పెద్దతండాకు చెందిన వాడిత్య ధర్మానాయక్‌కు నకిలీ నోట్ల చలామణి కేసులో మెదక్ కోర్టు సీనియర్ జడ్జి జితేందర్ మూడేండ్ల జైలుశిక్ష విధించారు. గురువారం పూర్తి సాక్ష్యాధారాలు పరిశీలించిన జడ్జి మూడేండ్ల కఠిన కారాగార శిక్ష విధించారు. నేరస్తుడికి శిక్ష పడేలా చేసిన కేసు విచారణ అధికారి రాజ్‌కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజయ్య, కోర్టు లైజింగ్ ఆఫీసర్ అంతోళ్ల కృష్ణ, వినోద్, పోలీస్ సిబ్బంది మల్లారెడ్డిని ఎస్పీ బాలస్వామి అభినందించారు.

తల్లీకూతుర్ల అదృశ్యం

టేక్మాల్, ఫిబ్రవరి 8: తల్లీకూతురు అదృశ్యమైన ఘటన టేక్మాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అచ్చన్నపల్లిలో జరిగింది. ఏఎస్సై తుక్కయ్య తెలిపిన వివరాల ప్రకారం.. టేక్మాల్ మండలంలోని అచ్చన్నపల్లి గ్రామానికి చెందిన కడల లావణ్యకు కొల్చారం మండలం చిన్నఘనపూర్ గ్రామానికి చెందిన కడల మల్లేశంతో ఎనిమిదేండ్ల క్రితం వివాహం చేశారు. వారికి ఆరేండ్ల కుమార్తె లాహిత్య ఉంది. ఈ నెల 4న మల్లేశం భార్యా కూతురిని అచ్చన్నపల్లిలో విడిచి వెళ్లాడు. మరుసటి రోజు లావణ్య తన అత్తింటికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. 6న లావణ్య తండ్రి లక్ష్మయ్య, మల్లేశానికి ఫోన్ చేసి లావణ్య వచ్చిందా అని అడిగాడు. రాలేదని తెలపడంతో బంధువులు, చుట్టుపక్కల వారి వద్ద ఆచూకీ కోసం గాలించారు. ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. లావణ్య తమ్ముడు వడ్డె మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తుక్కయ్య తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-319433-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వెల్దుర్తి : అచ్చంపేటలో మొబైల్ యాప్‌లో వివరాల నమోదు వివరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

కొల్చారంలో వివరాలు తెలుసుకుంటున్న మండల ప్రత్యేకాధికారి నాగరాజు

తప్పుల సవరణకు మొబైల్ యాప్

- మహాలక్ష్మి పథకంలో నమోదైన వివరాలను సరి చేసుకోవాలి
- సిబ్బందికి సహకరించాలి
- కలెక్టర్ రాజర్షిషా
- జిల్లాలో ముమ్మరంగా ఎల్‌పీజీ సర్వే
- యాప్‌లో వివరాల నమోదుపై అధికారులకు దిశా నిర్దేశం

మెదక్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): ప్రజాపాలన సందర్భంగా ప్రజలు అందజేసిన దరఖాస్తుల్లో గ్యాస్ కనెక్షన్‌కు సంబంధించి అసంపూర్తిగా ఉన్న వివరాలను వెంటనే సేకరించి నిర్ధారిత యాప్‌లో పొందుపర్చాల్సిందిగా కలెక్టర్ రాజర్షి షా సర్వే బృందాలను ఆదేశించారు. గురువారం జిల్లాలోని అదనపు కలెక్టర్ రమేశ్, నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, డివిజనల్ పంచాయతీ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అభయహస్తం కింద ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో ఒకటైన రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాన్ని త్వరలో అమలుచేయనున్నట్లు తెలిపారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించగా సరైన వివరాలు పేర్కొనలేదని, ఇది గమనించి ఆ వివరాలు సేకరించాల్సిందిగా ఆదేశించినట్లు పేర్కొన్నారు. దరఖాస్తులో గ్యాస్ ఏజెన్సీ పేరు, కన్స్యూమర్ నెంబర్, రేషన్‌కార్డు నెంబర్ వివరాలు పొందుపర్చలేదన్నారు. అర్హులైన ఏ ఒక్కరూ నష్టపోకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం తప్పిదాలను సరిచేసేందుకు ప్రత్యేక యాప్ రూపొందించిందన్నారు. తప్పిదాలను సరిచేసేందుకు గ్రామ, మున్సిపల్ వార్డు స్థాయి బృందాలు తమకు కేటాయించిన ప్రాంతాలను విస్తృతంగా పర్యటించి, వివరాలు సేకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. యాప్‌లో వివరాలు ఎలా నమోదు చేయాలో అధికారులకు దిశానిర్దేశం చేశారు. సర్వే బృందాలు ఈ నెల 10లోగా తప్పిదాలు నమోదు చేసిన దరఖాస్తుదారులను సంప్రదించి, సమగ్ర వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేసేలా పర్యవేక్షించాల్సిందిగా ఎంపీడీవోలు, ఎంపీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లకు కలెక్టర్ సూచించారు. కాన్ఫరెన్స్‌లో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, బిల్ కలెక్టర్లు, వీఏవోలు, వార్డ్ ఆఫీసర్లు, రిసోర్స్ పర్సన్, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కలెక్టర్ పర్యటన

వెల్దుర్తి, ఫిబ్రవరి 8 : ప్రజాపాలన దరఖాస్తులో చేసిన మహాలక్ష్మి తప్పుల సవరణకు మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నట్లు కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. వెల్దుర్తి మండలం ఉప్పులింగాపూర్, మాసాయిపేట మండలం అచ్చంపేట గ్రామాల్లో మహాలక్ష్మి నమోదు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. యాప్ వివరాల నమోదును అడిగి తెలుసుకుని సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏవైనా తప్పులుంటే లబ్ధిదారులకు వివరించాలన్నారు. యాప్‌లో వివరాలు నమోదు చేసే సమయంలో వస్తున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి సిబ్బంది తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1.57 లక్షల దరఖాస్తులు వచ్చాయని, 87 వేల దరఖాస్తుల్లో వివరాలు సరిగ్గా ఉండడంతో ఆన్‌లైన్‌లో నమోదు చేశామని, 70 వేల దరఖాస్తుల్లో లబ్ధిదారులు వివరాలను తప్పుగా రాయడంతో నమోదు చేయలేదన్నారు. దీంతో మొబైల్ యాప్ రూపొందించి, కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్, ఎఫ్ఏలు, వీవోఏలు వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. సమస్యలుంటే వెంటనే టెక్నికల్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తారన్నారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ, మాసాయిపేట తహసీల్దార్ జ్ఞానజ్యోతి, ఆర్ఐ ధన్‌సింగ్, ఏపీవో రాజు, కార్యదర్శులు ఉన్నారు.

వివరాలు సరిచూసుకోవాలి

కొల్చారం, ఫిబ్రవరి 8 : ప్రతి లబ్ధిదారుడు మహాలక్ష్మి దరఖాస్తుల్లో వివరాలను సరిచూసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా యువజన సంక్షేమాధికారి నాగరాజు సూచించారు. కొల్చారంలో మహాలక్ష్మి పథకం కింద గ్యాస్ సబ్సిడీకి దరఖాస్తు చేసుకున్నవారి వివరాలు తప్పుగా ఉన్నవారి ఇండ్లకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్యాస్ సబ్సిడీకి రేషన్‌కార్డు నెంబర్ తప్పుగా నమోదు చేయడంతో సరిచేసేలా చూడాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఎంపీడీవో గణేశ్‌రెడ్డి పర్యవేక్షించారు. వారితో ఎంపీవో లక్ష్మీనర్సింహులు, పంచాయతీ కార్యదర్శులు అంజయ్య, శ్రీదేవి, కారోబార్ ప్రభాకర్ ఉన్నారు.

మెదక్ జిల్లా తుది ఓటరు

జాబితా విడుదల

మొత్తం 4,42,891 మంది ఓటర్లు

మెదక్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సంఘం ఆదేశాలకనుగుణంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా గురువారం తుది ఓటరు జాబితాను విడుదల చేశారు. జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 4,42,891 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 9 మంది ఎన్ఆర్ఐలు, సర్వీస్ ఓటర్లు 126 మంది ఉన్నారు. మొత్తం 2,13,460 మంది పురుషులు, 2,29,431 మంది మహిళా ఓటర్లు, 11 మంది థర్డ్ జెండర్స్ ఉన్నారు. 9 మంది ఎన్ఆర్ఐలు. 126 మంది సర్వీస్ ఓటర్లలో పురుషులు 121 మంది, ఐదుగురు మహిళా ఓటర్లు ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్లు

మెదక్ అసెంబ్లీలో 274 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 1,03,654 మంది పురుషులు, 1,13,089 మంది మహిళలు, 5 థర్డ్ జెండర్స్, 8 మంది ఎన్ఆర్ఐలు, 87 మంది సర్వీస్ ఓటర్లు మొత్తం 2,16,743మంది ఓటర్లు ఉన్నారు. నర్సాపూర్ అసెంబ్లీలో 305 పోలింగ్ కేంద్రాలు, 109806 మంది పురుషులు, 1,16,342 మంది మహిళలు, 6 థర్డ్ జెండర్స్, 1 ఎన్ఆర్ఐ, 39 సర్వీస్ ఓటర్లు మొత్తం 2,26,148 మంది ఓటర్లు ఉన్నారు.

కమ్యూనిటీహాల్ నిర్మాణానికి భూమి పూజ



దండుపల్లిలో గౌడ సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్

మనోహరాబాద్, ఫిబ్రవరి 8: మండలంలోని దండుపల్లిలో జడ్పీకోటాలో రూ.15 లక్షలతో నిర్మించనున్న గౌడ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాగౌడ్ గురువారం భూమిపూజ చేశారు. మొదటగా రూ.3.19 లక్షలు విడుదల చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, ఎంపీటీసీ లతావెంకటేశ్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ మహేందర్‌గౌడ్, నాయకులు సుధాకర్‌రెడ్డి, భిక్షపతి పాల్గొన్నారు.

మంజీరా నదిలో 'మాఘ' స్నానాలు

- చిట్కుల్‌లోని చాముండేశ్వరీ అలయంలో మాఘ ఉత్సవాలు

చిలిపిచెడ్, ఫిబ్రవరి 8 : మండలంలోని చిట్కుల్ గ్రామ శివారులోని మంజీరా నది తీరాన వెలిసిన చాముండేశ్వరీ అలయానికి ఎంతో విశిష్టత ఉందని ఆలయ కమిటీ సభ్యులు, ప్రధాన అర్చకుడు ప్రభాకర్ శర్మ తెలిపారు. శుక్రవారం మాఘ అమావాస్య సందర్భంగా మంజీరా నదిలో స్నానాలు చేయడానికి, ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. స్థానిక ఎస్సై షేక్ మహబుబ్ ఆధ్వర్యంలో 20 మంది పోలీస్ సిబ్బంది, ఎన్‌సీసీ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఆలయానికి సమీపంలో మంజీరా నది తీరం ఉండడంతో భక్తులు మాఘ అమావాస్య సందర్భంగా స్నానాలు చేయడానికి అధిక సంఖ్యలో తరలివస్తారని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది శోభన్‌బాబు తెలిపారు.

అక్రమాల ఆర్ఐకి రిమాండ్

తూప్రాన్, ఫిబ్రవరి 8 : తూప్రాన్ పౌర సరఫరాల గోదాంలో రూ.3 కోట్ల అక్రమాలకు పాల్పడిన కేసులో ఆర్ఐగా పని చేసిన నగేశ్‌పై కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. మనోహరాబాద్ మండలం పర్కిబండకు చెందిన చింతల నగేశ్ తూప్రాన్ ఆర్ఐగా పని చేశాడు. అనంతరం తూప్రాన్ పౌర సరఫరాల గోదాంలో 2019-2023 వరకు విధులు నిర్వహించాడు. ఈ క్రమంలో రూ.3కోట్ల వరకు పీడీఎఫ్ బియ్యం, చక్కెర, గోనె సంచుల్లో అక్రమాలకు పాల్పడినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వచ్చాయి. విచారించిన అధికారులు ఆర్ఐ నగేశ్‌ను సస్పెండ్ చేశారు. సివిల్ సప్లై జిల్లా మేనేజర్ హరికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. గతేడాది తూప్రాన్ రెవెన్యూ ఆర్ఐగా పని చేసినప్పుడు 12 గుంటల భూమి విషయంలో రైతు బతికుండగానే చనిపోయాడని తప్పుడు ధ్రువీకరణ పత్రాలు తయారు చేసి, వేరే వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేశాడు. ఈ విషయంలో సస్పెండ్ అయ్యాడు. తిరిగి సివిల్ సప్లై కేసులో రూ.3 కోట్ల అక్రమాలు చేసినట్లు ఫిర్యాదు రాగా, నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు.

ఫార్మసీ రంగానికి ఉజ్వల భవిష్యత్

- విష్ణు ఫార్మసీ కళాశాలలో ఔషధ్-2024 అంతర్జాతీయ సదస్సు

విష్ణు ఫార్మసీ కళాశాలలో ఔషధ్-2024 అంతర్జాతీయ సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు, విష్ణు ఫార్మసీ కళాశాల యాజమాన్యం

నర్సాపూర్, ఫిబ్రవరి 8: ఫార్మసీ రంగానికి ఉజ్వల భవిష్యత్ ఉన్నదని ఔషధ్-24 అంతర్జాతీయ సదస్సు ముఖ్య అతిథులు అన్నారు. నర్సాపూర్ సమీపంలోని విష్ణు ఫార్మ సీ కళాశాలలో ఔషధ్-2024 అంతర్జాతీయ సదస్సును గురువారం నిర్వహించారు. సదస్సుకు పీసీఐ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రమోద్ యోలె, క్లినికల్ రీసెర్చ్ (టెక్సిలా అమెరికన్ యూనివర్సిటీ) డాక్టర్ ప్రసాద్ వరనూలి, కిస్నో ఇనిస్టిట్యూట్ ఫర్ అడ్వాన్స్‌డ్ న్యూరోసైన్స్ జేఎంయూ, యూఎస్ఏ డాక్టర్ రామ కృష్ణ మెడూరి, ఆరు దేశాల నుంచి, తెలంగాణలోని 45 ఫార్మసీ కళాశాలల నుంచి సుమారు 1100 పైగా విద్యార్థులు, అధ్యాపకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఓరల్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రెజెంటేషన్, డిబెట్, క్విజ్ పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్, వైస్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, ప్రోగ్రామ్ కన్వీనర్స్ బి.జాహ్నవి, సంధ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏడుపాయల్లో

ఏర్పాట్లు చేయాలి

- ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 8: మఘా అమావాస్య సందర్భంగా ఏడుపాయలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అధికారులకు ఆదేశించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో ఎమ్మెల్యే రోహిత్‌మాట్లాడారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడవద్దని, స్నానఘట్టాల వద్ద గజ ఈతగాళ్లను ఏర్పాటుచేయాలన్నారు. పోలీసుశాఖ అప్రమత్తతో ఉండి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

గురుకులాల్లో ప్రవేశ

పరీక్షకు ఏర్పాట్లు చేయాలి

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 8: తెలంగాణ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 11న నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రమేశ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మెదక్, రామాయంపేట, తూప్రాన్, కొల్చారం, తునికీలో మొత్తం 6 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొత్తం 2,540 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగనున్నదన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ మహేందర్, అధికారులు వరలక్ష్మి, సరళాదేవి, స్వాతి, విక్రమ్, మహేశ్వరి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

చేగుంట, ఫిబ్రవరి 8: రోడ్డు ప్రమాదాలు, ఆన్‌లైన్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని చేగుంట ఎస్సై హరీశ్‌గౌడ్, ఏఎస్సై రవీందర్ పేర్కొన్నారు. మండలంలోని పోతాన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో మెదక్ జిల్లా పోలీసు కళా బృందంతో గురువారం సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం రామారావు, కళా బృందం సభ్యులు సురేందర్ పాల్గొన్నారు.

నిప్పంటుకుని మహిళ మృతి

నిజాంపేట, ఫిబ్రవరి 8 : చీరకు నిప్పంటుకుని కాలిన గాయాలతో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఓ మహిళ మృతి చెందింది. కల్వకుంటకు చెందిన సువర్ణ(56) ఇంట్లో వంట చేస్తుండగా చీరకు నిప్పంటుకున్నది. దీంతో సువర్ణకు తీవ్రగాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో మృతి చెందింది.

ఘనంగా ఎల్లమ్మ జాతర

కర్నాల్‌పల్లిలో కాటమయ్య ఊరేగింపు

చేగుంట, ఫిబ్రవరి 8 : మండలంలోని కర్నాల్‌పల్లిలో రేణుకాఎల్లమ్మ జాతర కొనసాగుతున్నది. గురువారం కాటమయ్యకు గౌడ సంఘం ఆధ్వర్యంలో బోనం తీయుట, అమ్మవారికి కొట్టం పెట్టుట కార్యక్రమాలు చేశారు. శుక్రవారం మాఘ అమావాస్య సందర్భంగా ఎల్లమ్మ, జమదగ్ని కల్యాణం, ఒడిబియ్యం సమర్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గౌడ సంఘం నేతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గౌడ సంఘం నేతలు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు

రామాయంపేట/ కొల్చారం, ఫిబ్రవరి 8 : రామాయంపేట మండలంలో పారిశుధ్య పనులు కొనసాగుతున్నాయి. గురువారం కోనాపూర్ గ్రామాన్ని ప్రత్యేకాధికారి రజినీకుమారి సందర్శించారు. నేటినుంచి 14వ తేదీ వరకు పనులు జరుగుతాయన్నారు. కోనాపూర్, సుతారిపల్లి, ఝాన్సీలింగాపూర్, శివ్వాయపల్లి, డీ.ధర్మారం, అక్కన్నపేట తదితర గ్రామాల్లో మురుగు కాల్వలు, వీధులను పారిశుధ్య కార్మికులు శుభ్రం చేశారు.

పారిశుధ్య చర్యలు చేపట్టాలి

కొల్చారం మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. చిన్నఘన్‌పూర్, వసురాం తండా, అంసాన్‌పల్లి, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులు, చిన్నాఘన్‌పూర్‌లో మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతులను ఎంపీడీవో గణేశ్‌రెడ్డి పర్యవేక్షించారు. వారితో ఎంపీవో లక్ష్మీనర్సింహులు, పంచాయతీకార్యదర్శులు అంజయ్య, శ్రీదేవి, కారోబార్ ప్రభాకర్ ఉన్నారు.

కొల్చారం : చిన్నాఘన్‌పూర్‌లో పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో గణేశ్‌రెడ్డి

ఎనగండ్ల పాఠశాలలో డీఈవో తనిఖీ

ఎనగండ్లలో పాఠశాలకు హాజరు కాని విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో రాధాకిషన్

కొల్చారం, ఫిబ్రవరి 8 : మండలంలోని ఎనగండ్ల పాఠశాలను డీఈవో రాధాకిషన్ గురువారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల సాధన, ప్రాక్టీస్ టెస్ట్‌లను పరిశీలించారు. కొంతకాలంగా గైర్హాజరవుతున్న విద్యార్థుల ఇండ్లను సందర్శించి, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేసి, బడికి పంపాలని కోరారు. డీఈవోతో అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన మూర్తి, సీఎంవో సతీశ్, హెచ్ఎం వెంకటరమణాచార్యులు ఉన్నారు.

చట్టాలను అందరూ గౌరవించాలి

సీఐ వెంకటేశ్‌ను సన్మానిస్తున్న వెంకటాపూర్(కే) గ్రామస్తులు

రామాయంపేట, ఫిబ్రవరి 8: చట్టాలను అందరూ గౌరవించాలని, పోలీసులు నిత్యం అండగా ఉంటారని సీఐ వెంకటేశ్ తెలిపారు. గురువారం నిజాంపేట మండలం వెంకటాపూర్(కే) సర్పంచ్, ఎంపీటీసీలు సీఐని సన్మానించారు. కార్యక్రమంలో నిజాంపేట ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ అనిల్‌కుమార్, ఎంపీటీసీ సిద్దిరాములు, మాజీ సర్పంచ్ దేవేష ధర్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు దయాకర్, నందు తదితరులు ఉన్నారు.

వామపక్ష ప్రభుత్వంపై వివక్ష సరికాదు

మెదక్ పట్టణంలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 8: కేరళలోని వామపక్ష ప్రభుత్వంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వివక్ష చూపడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం విమర్శించారు. గురువారం జిల్లా కేంద్రంలోని పోస్టాఫీస్ చౌరస్తాలో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్ని రాష్ట్ర విపక్ష ప్రభుత్వాలపై వివక్ష ప్రదర్శిస్తున్నదన్నారు. కేరళ రాష్ట్రానికి రావాల్సిన గ్రాంట్లు నిలిపేస్తున్నదని ఆరోపించారు. ధర్నాలో సీపీఎం నాయకులు బస్వారాజు, కె.మల్లేశం, నర్సమ్మ, జగన్, అజయ్, రాజిరెడ్డి, గౌతమ్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

విపత్తులపై అవగాహన అవసరం

ఫైన్ ఆర్ట్స్ పాఠశాలలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసులు

నర్సాపూర్, ఫిబ్రవరి 8: విపత్తులు సంభవించినప్పుడు వాటిని ఎదుర్కొనే అంశాలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని ఆర్డీవో శ్రీనివాసులు సూచించారు. గురువారం నర్సాపూర్‌లోని గిరిజన గురుకుల ఫైన్ ఆర్ట్స్ పాఠశాలలో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ టీమ్ సభ్యులు విపత్తులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విపత్తులు సంభవించినప్పుడు ప్రజలను ఎలా కాపాడాలో టీమ్ సభ్యులు ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ వానకాలంలో వచ్చే వరదలు, ఇతర ప్రమాదాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, అలాంటప్పుడు ప్రజలను కాపాడాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వెల్లడించారు. అగ్నిప్రమాదాలు, భూకంపాలు సంభవించినప్పుడు ఎలా కాపాడాలో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ టీమ్ సభ్యులు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కమలాద్రి, ఇన్‌